
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

బుధవారం 24 సెప్టెంబరు 2025

భీమవరం **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 32.0

కనిష్ఠం : 25.0



బాలా త్రిపురసుందరీ నమోస్తుతే !

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లు భక్తులకు పలు రూపాల్లో దర్శనం ఇచ్చారు. పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి బాలాత్రిపురసుందరీగా దర్శనం ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

మహిళలు, పిల్లల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి : కలెక్టర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో టేక్ హోమ్ రేషన్, బాలామృతం, ప్రీస్కూల్ హాజరు, బాల్య వివాహాలు, గర్భిణులు, బాలింతల, పిల్లల ఆరోగ్య అంశాలపై సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం తింటున్నారా లేదా పరిశీలించి ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. బాలామృతం పథకం ద్వారా ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయసు పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా తింటున్నారా లేదా పరిశీలించాలన్నారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్చే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, నోడల్ అధికారి పి.విజయలక్ష్మి, ఈవో సుజాత, సీడీపీవోలు వి.వాణి విజయరత్నం, లక్ష్మీ,కాంతం, ఊర్మిళ, ఉమ, కృష్ణకు మారి, సరస్వతి, శ్రీలక్ష్మి, సూపర్వైజర్‌లు పాల్గొన్నారు.



దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

భీమవరంటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రయాణికులను తీసుకువచ్చేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. రెగ్యులర్‌గా హైదరాబాద్ నుంచి జిల్లాలకు వచ్చే 14 సర్వీసుల రిజ ర్వేషన్‌లు ఫుల్ కావడంతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు జిల్లానుంచి హైదరాబాద్‌కు భీమవ రంనుంచి 2, నరసాపురం నుంచి 4, తాడేపల్లిగూడెం నుంచి 4 , తణుకు డిపో నుంచి 4 సర్వీసులు నడు స్తాయి. అక్కడ నుంచి రిజర్వేషన్‌లు పూర్తి కావడంతో హైదరాబాద్ నుంచి 30వ తేదీన 4 బస్సులు, 1న 7 సర్వీసులను ఏర్పాటు చేశారు. దసరా సెలవులు పూర్తయి తిరిగి హైదరాబాద్‌కు వెళ్ళే ప్రయాణికుల కోసం ప్రత్యేక సర్వీసులను వచ్చేనెల 3,4 తేదీల్లో ఏర్పాటు చేశారు. విజయవాడకు రద్దీ ఉంటే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

భిన్న వాతావరణంతో ఉక్కిరి బిక్కిరి

భీమవరం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భిన్నమైన వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతు న్నారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం ఎండ తీవ్రత కనిపించింది. సాయంత్రం 5 గంటల సమ యంలో మబ్బులు, చల్లగాలులతో వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారుజామున జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.అత్యధికంగా తాడేపల్లిగూ డెంలో 35.2 మిల్లిమీటర్లు నమోదైంది. గణపవరంలో 1.6, పెంటపాడులో 11, ఆకివీడులో 5.2, ఉండిలో 4.6, పాలకోడేరులో 3.8, పెనుమంట్రలో 3.2, ఆచంటలో 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

లోటుపాట్లు రానివ్వద్దు

- 25న వెలగపూడిలో నియామక పత్రాలు అందుకోనున్న మెగా డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులు

లాంఛనాలు భరించలేం..

- తనిఖీల పేరుతో తూనికలు కొలతల శాఖ వసూళ్లు
- బెంబేలెత్తుతున్న రేషన్ డీలర్లు

లోపలి పేజీల్లో...

పసిడికి ట్రంప్ ఎఫెక్ట్



ఈ వారంలో గ్రాముకు రూ. 300 పెరుగుదల

బిస్కెట్ బంగారం గ్రాము రూ.11,870

ఆర్నమెంట్ ధర రూ.10,920



నరసాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పసిడి ధరకు ట్రంప్ ఎఫెక్ట్ వెంటాడుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో బంగారం ధర రోజురోజుకు దూసుకుపోతున్నది. ఈ వారంలోనే గ్రాముకు రూ.300 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో మంగళవారం బిస్కెట్ బంగారం గ్రాము రూ.11,870కి చేరగా ఆర్నమెంట్ బంగారం రూ.10,920 పలికింది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పసిడి ధర పెరుగుతూ వస్తున్నది. ఈ ఏడాది జనవరిలో గ్రాము బిస్కెట్ బంగారం రూ.7,940 ఉండగా ఆర్నమెంట్ బంగారం రూ.7,300 ఉంది. ఈ తొమ్మిది నెలల కాలంలో బిస్కెట్ గ్రాముకు రూ.3,930, ఆర్నమెంట్‌కు రూ.3,620 పెరిగింది. ఈ ధర ఇదే విధంగా పెరిగితే ఈ ఏడాది చివరికి గ్రాము రూ.13 వేలకు చేరే అవకాశం ఉందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పండుగ కళ లేనట్లే

దసరా, దీపావళి పండుగలకు చాలా మంది పసిడి వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ఎక్కువగా దీపావళికి సెంటిమెంట్‌గా ఆభరణాలు చేయించుకుంటారు. ఈసారి మార్కెట్‌లో పండుగ కళ కనిపించడం లేదు. బంగారం ధర రోజురోజుకు పెరుగుతుండటంతో మార్కెట్ వైపు వినియోగదారులు కన్నెత్తి చూడటం లేదు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. సీజన్ ప్రభావం మచ్చుకైనా కనిపించడం లేదు. దాదాపు నెల తరువాత మళ్లీ శుభ కార్యక్రమాలు మొదల వడంతో బిజినెస్ ఉంటుందని వ్యాపారులు అంచనా వేశారు. కానీ ధర తగ్గక పోవడంతో పెద్ద మొత్తాల్లో కొనుగోలు చేయడం లేదు. సూత్రాలు, నల్లపూసలు వంటి చిన్న వస్తువులతోనే సరిపెడుతున్నారు.



విద్యార్థుల మెడపై ఫీజుల కత్తి

- కట్టి తీరాల్సిందేనంటున్న కళాశాలల యాజమాన్యాలు
- వైసీపీ హయాంలో పెండింగ్ బకాయిలపై పట్టు
- మూడు క్వార్టర్లు చెల్లించాలంటూ ఒత్తిడి
- ప్రభుత్వం చెల్లిస్తే తీసుకోవచ్చంటూ సలహా
- ఇతర జిల్లాల్లో విద్యా సంస్థల నుంచి విద్యార్థుల ఇళ్లకు ఫోన్‌లు
- అప్పు చేసి ఫీజులు చెల్లిస్తున్న తల్లిదండ్రులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో దొడ్డ బాలాజీ చిరువ్యాపారం చేస్తుంటారు. ఇద్దరు పిల్లలను తూర్పుగోదావరి జిల్లాలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో చదివిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ కళాశాలల ఖాతాలో జమవుతుందని ఆశించారు. గత నెలవరకు ఎటువంటి సమస్య రాలేదు. ఆ తర్వాతే ఒత్తిడి మొదలైంది. పిల్లల ఫీజులు చెల్లించాలంటూ కళాశాల నుంచి ప్రతిరోజు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. "ఫీజు చెల్లించకపోతే పరీక్షలు రాసే అవకాశం ఉండదు. విద్యాసంస్థను ఎలా నిర్వహించాలి. ముందుగా ఫీజు చెల్లించండి. ప్రభుత్వం చెల్లిస్తే తిరిగి తీసుకునే వెసులుబాటు కల్పిస్తాం.." అని చెప్పడంతో బాలాజీ అప్పు చేసి ఫీజు చెల్లించారు.

భీమవరం పరిధిలోని ఓ ఇంజనీరింగ్ కలాశాలలో పావని బీటెక్ చదువుతోంది. ఇప్పుడు నాలుగో సంవత్సరం. ఉద్యోగం సాధించాలన్న తపనతో ప్రిపేర్ అవుతోంది. కానీ 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదు. తల్లుల ఖాతాలో అప్పట్లో జమ చేసేవారు. ప్రభుత్వం చెల్లించకపోయినా సరే కళాశాలలు పెద్దగా ఒత్తిడి చేయలేదు. వైసీపీ హయాంలో మూడు క్వార్టర్లు, ప్రస్తుత ప్రభుత్వంలో మరో మూడు క్వార్టర్లు బకాయి ఉండడంతో సదరు కళాశాల యాజమాన్యం ఫీజుల కోసం ఒత్తిడి మొదలెట్టారు. కనీసం గత ప్రభుత్వంలో బకాయిలను చెల్లించాలని పట్టు బడుతున్నారు. పావని తల్లిదండ్రులకు ఫోన్ చేస్తున్నారు. దీంతో ఇప్పుడు పావని చదువుపై కంటే ఫీజు కోసమే ఆలోచించే పరిస్థితి ఏర్పడింది.


గడిచిన నెల రోజుల నుంచి ఫీజుల కోసం ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. డిగ్రీ కళాశాలలు అదే బాటపట్టాయి. వారం రోజుల్లో బకాయిలు చెల్లిస్తామంటూ ప్రభుత్వం నుంచి సంకేతాలు అందాయి. అంత వరకు వేచి చూడాలని విద్యా సంస్థలు భావిస్తున్నాయి. ఆ తర్వాత సమ్మెకు వెళ్లాలని నిర్ణయించాయి. విద్యాసంస్థలను మూసి వేయాలన్న నిర్ణయం తీసుకున్నాయి. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్‌లు తమ వాట్సప్ గ్రూపుల్లో ఇటువంటి సందేశాలను పంచుకుంటున్నాయి. వైసీపీ హయాంలో జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు బటన్ నొక్కారు. కానీ సొమ్ములు జమ చేయలేదు. మూడు క్వార్టర్లు అంటే 2023-24 విద్యా సంవత్సరానికి దాదాపు రూ.75 కోట్లు జిల్లాలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలకు బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజులు పెంచింది. మరోవైపు మూడు క్వార్టర్ల బకాయిలు చెల్లించలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో మూడు క్వార్టర్‌లకు సంబంధించి దాదాపు రూ. 105 కోట్లు చెల్లించాలి. మొత్తంపైన రూ.180 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో సిబ్బందికి ఇంక్రిమెంట్‌లు కూడా వేయడం లేదు. సకాలంలో వేతనాలు ఇవ్వడానికి ఆపసోపాలు పడుతున్నాయి.

వైసీపీ బకాయిలపై పూర్తయిన పరిశీలన

వైసీపీ హయాంలో బకాయిలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. కళాశాలలకు విద్యార్థులు ఫీజులు చెల్లించారా..? బకాయిలు ఉన్నారా అంటూ ఆరా తీసింది..? ఫీజులు చెల్లిస్తే తల్లుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫీజు చెల్లించకపోతే కళాశాలల ఖాతాలో వేయాలని నిర్ణయించింది. ఏడాది క్రితమే ప్రతి కళాశాలను సంప్రదించి ఆరా తీసింది. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకుంది. కానీ బకాయిలు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క క్వార్టర్ మాత్రమే చెల్లించారు. మరో మూడు క్వార్టర్లు బకాయి పడ్డారు. దీనికోసం కళాశాలలు ఆతృతగా చూస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ప్రభుత్వం బకాయిలపై ప్రకటనలు చేస్తూ వస్తోంది. కానీ విడుదల చేయడం లేదు. ఇదే ఇప్పుడు కళాశాలలను కుంగదీస్తోంది. దసరా సెలవుల తర్వాత సమ్మెకు వెళ్లాలని కళాశాలలు నిర్ణయం తీసుకున్నాయి. అంతలోగానే ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

మంత్రి నిమ్మల ఇంట పెళ్లి సందడి

- కుమార్తె వివాహ వేడుకలకు భారీ ఏర్పాట్లు
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హాజరు



పాలకొల్లు, సెప్టెం బరు 23 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల ఇంట పెళ్లి సందడి నెలకొంది. రామా నాయుడు, సూర్య కుమారిల ఏకైక కుమార్తె శ్రీజ వివాహం బుధవారం రాత్రి పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద నిర్వహించ నున్నారు. వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు రానున్నారు. బైపాస్ రోడ్డులో ప్రత్యేకంగా హెలిప్యాడ్ నిర్మాణం చేశారు.బుధవారం మధ్యాహ్నం 1.15 నిముషాలకు హెలి కాప్టర్‌లో సీఎం పాలకొల్లు చేరుకుంటారు. 2.15 వరకూ వివాహ వేదిక వద్ద ఉండి నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతరం 2.30 గంటలకు విజయవాడ బయలుదేరుతారు. వివాహానికి సుమారు 40 వేల మందికి పైగా రానున్నట్టు అంచనా. వీరవాసరం మండలం తోలేరు గ్రామానికి చెందిన యర్రింకి వెంకట సూర్య సత్యనారాయణ, కరుణామణిల ఏకైక కుమారుడు దుర్గా హరిహర సాయి పవన్ కుమార్‌తో శ్రీజ వివాహం బుధవారం రాత్రి 12.39 నిముషాలకు జరగనుంది.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి

కొత్త దారి



- తణుకు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ రోడ్డు
- గోస్తనీ కాలువ గట్టు అభివృద్ధి

తణుకు పట్టణం విస్తరిస్తున్నది.. జనాభా పెరుగుతోంది.. ట్రాఫిక్ సమస్యలూ పెరుగుతున్నాయి..తణుకు పట్టణానికి ప్రధానమైనది రాష్ట్రపతి రోడ్డు. పట్టణంలో ప్రవేశించాలంటే ఈ రోడ్డే దిక్కు. ప్రత్యామ్నాయ రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణం నరకంగా మారుతుంది. ఈ సమస్యకు కొంత పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చర్యలు తీసుకుంటున్నారు..

తణుకు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :తణుకు పట్టణంలో ఎప్పుడో ఉన్న రోడ్లు తప్పితే కొత్తగా రోడ్లు నిర్మించలేదు. పరిసర ప్రాంతాల ప్రజలు ఉపాధి, వ్యాపారాలు కోసం తణుకు పట్టణాన్ని ఎంచుకుంటున్నారు. దీంతో పట్టణంలో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గోస్తనీ కాలువపై రోడ్లు అభివృద్ధి చేయాలని భావించారు. దీంతో చాలావరకు ట్రాఫిక్ ను మళ్ళింపు ద్వారా పట్టణంపై ఒత్తిడి తగ్గించి ట్రాఫిక్ లేకుండా చేయాలనే ప్రధాన ఉద్దేశ్యానికి పునాలు వేసారు. ఇందులో భాగంగానే కాలువ పక్క రోడ్డులు వేయడానికి పనులు కూడా మొదలు పెట్టారు.

రెండు రోడ్లు నిర్మాణం

ప్రధానంగా పట్టణంలోకి వచ్చే ప్రయాణికులకు పట్టణంతో సంబంధం లేకుండా తణుకు పాతూరు వెళ్లేందుకు వీలుగా రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. అలాగే పట్టణంలోకి రాకుండా బైపాస్‌కు వెళ్లేవారికి సులువుగా ఉండేలా ప్లాన్ చేశారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

చాలా ఉపయోగం : తాతిపూడి మారుతీరావు



పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇపుడు చేపట్టే గోస్తనీ కాలువ గట్టు రోడ్డు అభివృద్ధి చేయడం చాలా అవసరం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త రోడ్లు కావాలి. సొసైటీ నుంచి శివా లయం వరకు వేసే రోడ్డు వల్ల ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు టౌన్‌తో సంబంధం లేకుండా నేరుగా వెళ్లే అవకాశం ఉంటుంది. రోడ్డు నిర్మాణం చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి.

ఇబ్బందులు తప్పుతాయి : శివప్రసాద్



పట్టణంలో జనాభా పెరగడంతో పాటు వాహనాలు తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ చాలా ఎక్కువగా ఉంటున్నది. ఒక్కోసారి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రత్యామ్నాయ రోడ్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. ఇపుడు కాలువ రోడ్డు అభివృద్ధి జరిగితే ఇబ్బందులు తొలగుతాయి.

పండుగ రోజుల్లో మరీ ఇబ్బంది : వల్లూరి గంగయ్య



గోస్తనీ కాలువ గట్టుపై రోడ్డు అభివృద్ధి చేయడం వల్ల పట్టణ ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో ఇబ్బందులతో పాటు పండుగలు వచ్చాయంటే మరింత ఇబ్బందులు ఉంటున్నాయి. చుట్టుపక్కల ప్రజలు కూడా ఇక్కడికే వస్తారు. కొత్త రోడ్లు వేస్తే ఇక్కట్లు తీరతాయి.

త్వరలోనే పూర్తిచేస్తాం రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఎమ్మెల్యే చొరవతో గోస్తనీ కాలువ గట్టుపై రోడ్ల అభివృద్ధి పనులు చేపడ తున్నాం. ఇప్పటికే పనులు జరుగుతున్నాయి. మెయిన్ రోడ్డు మీద ట్రాఫిక్ లోడు రద్దీ లేకుండా చేయాలనేది ప్రధాన ఉద్దేశ్యం. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తాం.

పట్టణంలోని జూబ్లీ రోడ్డు సమీపంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం కాలువ గట్టు నుంచి సొసైటీ రోడ్డు వరకు ఒకటి, సొసైటీ రోడ్డు నుంచి సజ్జాపురం శివాలయం వరకు మరొకటి చొప్పున రెండు బిట్‌లుగా రోడ్లు నిర్మించనున్నారు. దీనివల్ల ట్రాఫిక్ కష్టాలు చాలావరకు తీరే అవకాశాలు ఉన్నాయి. వీటి నిర్మాణం కోసం రూ.35 లక్షలు కేటాయించారు. మూడు దశల్లో పనులు జరుగుతాయి. ముందుగా కాలువ గట్టు పక్కన ఉన్న పిచ్చిమొక్కలు తొల గింపుతో పాటు చదును చేయనున్నారు. తర్వాత గ్రావెల్‌తో రోడ్డును అభివృద్ధి చేస్తారు.

గాయత్రీ దేవి దర్శనం

ఉమ్మడి జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దసరా ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. భీమవరం మావుళ్లమ్మ, ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, జంగారెడ్డిగూడెం నూకాలమ్మ, వీరంపాలెం బాలా త్రిపుర సుందరీదేవి, తాడేపల్లిగూడెం బలుసులమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గునుపూడి సోమేశ్వరాలయం, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరాలయాల్లో పార్వతి దేవిని భక్తులు దర్శించుకున్నారు. ఆచంట రామేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు. ఏలూరులోని అమ్మవారి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు.


ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ


తాడేపల్లిగూడెం గాయత్రిమాత


వీరంపాలెం బాలా త్రిపుర సుందరి



ఏలూరు పత్తేబాద, సత్రంపాడులో అమ్మవార్లకు గాయత్రి దేవి అలంకరణ


జంగారెడ్డిగూడెం గంగానమ్మ



భీమవరం మావుళ్లమ్మ, మెంటేవారి తోటలో దుర్గమ్మ


గాయత్రిదేవిగా నూకాలమ్మ


పెనుగొండలో గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన వాసవీ మాత


ఆచంటలో పార్వతీదేవి


కాళ్లకూరులో ధనలక్ష్మి అలంకారం


క్షీరారామంలో గాయత్రిగా పార్వతీదేవి

మ్యూజిక్ వైబ్ మిరాయ్


హరికి జ్ఞాపిక ఇస్తున్న ఆర్‌ఆర్‌ఆర్

తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన వండర్ విజువల్స్ హనుమాన్, మిరాయి చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు నమోదు చేశాయి. తాజా చిత్రం మిరాయ్ దేశవ్యాప్తంగా రికార్డుల మోత మోగిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్‌తో నిర్మితమైన ఈ చిత్రాలకు సంగీతం ప్రధానం. అద్భుత నేపథ్య సంగీతంతో సినిమా అలరిస్తే పాటలు మరింత ఆకట్టుకున్నాయి. సినిమాలో 'వైబ్ ఉంది' పాట చిత్రించినా తెరపై మాత్రం తొలగించారు. అయితేనేమి ఆడియో విడుదలతో ఆ గీతం పసందైన సంగీతంతో శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రాలకు సంగీత దర్శకుడు గౌర హరి మన గోదావరి జిల్లా వాసి. హరి తాతయ్య, అమ్మమ్మ స్వగ్రామం ఉండి. నానమ్మ, తాతయ్య స్వగ్రామం తణుకు. కొన్నాళ్లు ఉండిలో ఉన్న హరి విద్యాభ్యాసం తణుకులో సాగింది. తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయాడు. సంగీత దర్శకుడిగా అద్భుత ప్రతిభతో సొంత జిల్లాకు పేరు తెచ్చాడు.

సంగీత దర్శకుడు గౌర హరి ఉండి కుర్రోడే





ఉండి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న సంగీత దర్శకుడు గౌర హరి ఉండి కుర్రోడు. తాడికొండ లక్ష్మీనరసింహం (కరణం), సావిత్రమ్మ దంపతుల పెద్దకుమార్తె రాధా రమణి, క్రొవ్విడి బాల సుబ్రహ్మణ్యం సంతానం గౌర హరి. అతడికి ఒక చెల్లెలు ఉంది. అమ్మమ్మ ఊరు ఉండి బ్రాహ్మణపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంనకు సమీపంలో వారి కుటుంబం నివసించేది. ఇక్కడే ప్రాథమికి విద్యాభ్యాసం తర్వాత కొన్నాళ్లు నానమ్మ ఊరైన తణుకులో ఉన్నారు. తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయాడు. అక్కడ ప్రముఖ సంగీత దర్శకుడి వద్ద సంగీతంలో ప్రావీణ్యం సంపాదించాడు. హనుమాన్, మిరాయ్ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించడంతో పాన్ ఇండియా స్థాయిలో గౌర హరి పేరు దద్దరిల్లింది. తొలిసారి సంగీత దర్శకత్వం వహించిన రెండు చిత్రాలు అద్భుత విజయాలు సాధించడంతో చిత్రసీమలో ప్రస్తుతం దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్ మణికొండలో నివాసం ఉంటున్నాడు.

ఆర్‌ఆర్‌ఆర్ అభినందన

శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు సంగీత దర్శకుడు హరికి వేంకటేశ్వరస్వామి జ్ఞాపికన అందించి అభినందించారు. తన నియోజకవర్గానికి చెందిన యువకుడు చిత్రసీమలో అద్భుతంగా రాణించడం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమని హరిని అభినందించారు. స్థానికంగా పలువురు అభిమానులు గౌర హరి చిత్రం గీసి అభిమానాన్ని చాటుకున్నారు.

ఉండిలో ఒకటే సందడి..

తమ గ్రామానికి చెందిన యువకుడు చిత్రసీమలో మంచి గుర్తింపును సాధించడంతో ఉండిలో సందడి నెలకొంది. సినిమాలో లేని పాట 'వైబ్ ఉంది' ఇక్కడ మరింత మారుమోగుతోంది. గ్రామంలో యువత సంబరాలు జరుపుకున్నారు. గౌర హరి ఉండి రాక కోసం ఎదురుచూస్తున్నారు.

ఎంతో ఆనందం



మా గ్రామానికి చెందిన కుర్రోడు చిత్రపరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకోవడం ఆనందంగా ఉంది. మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిస్తున్నాను. ఇదేరీతిలో చిత్రపరిశ్రమలో కొనసాగాలని కోరుకుంటూ ఆశీర్వదిస్తున్నాను.

- ఇందుకూరి హరినారాయణరాజు, ఎంపీపీ, ఉండి

మా ఇంటి పక్కనే ఉండేవారు



గౌర హరి కుటుంబం మా ఇంటి పక్కనే నివాసం. మా కుటుంబంతో కలిసిమెలిసి ఉండేవారం. అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. హరి ఉన్నత స్థాయికి వెళ్లడం సంతోషంగా ఉంది.

- కామేశ్వరి (నాని మేడమ్), ఉండి

నా స్నేహితురాలికి అభినందనలు



నా స్నేహితురాలి కుమారుడు హరి. సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు సాధించడం సంతోషం. నా స్నేహితురాలికి అభినంనలు. మా దగ్గర చిన్నపిల్లోడు పెద్దస్థాయికి వెళ్లడం ఆనందంగా వుంది.

- కోకా పద్మిని, ఉండి



మట్టపర్రులో 'పొలం పిలుస్తుంది'లో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

ధాన్యం విక్రయాల్లో దళారులను ఆశ్రయించవద్దు

తక్కువ ధరకు అమ్ముకోవద్దు : జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

పోడూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దళారులు, కమీషన్ ఏజెంట్ల మాటలు నమ్మి రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. పోడూరు మండలం మట్టపర్రులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, రైతులు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని సూచించారు. ప్రస్తుతం ఏ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ. 2,389 సాధారణ రకానికి క్వింటాకు రూ.2369 మద్దతు ధర ఉంద న్నారు. గోనె సంచులకు ఎటువంటి కొరత లేదని రైతులకు అవసరమైన సంచులను ప్రభుత్వమే అందిస్తుం దన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు సార్వా సీజన్‌లో వచ్చే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. జిన్నూరు సొసైటీ అధ్యక్షుడు దేవళ్ల ప్రసాదు, సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాసరావు, పాలకొల్లు డీసీ వైస్ చైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ ఫాజిల్, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో విశ్వేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా మండపాక పీడీ ఎంపిక

తణుకురూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపాక జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణ రిఫరీగా ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం కె ఫణిశ్రీ తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే పోటీలకు రిఫరీగా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా పీడీని పలువురు అభినందించారు.

నీట మునిగిన 250 ఎకరాలు

ఆకివీడురూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలంలో 250 ఎకరాలు నీట మునిగిందని ఏవో ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం ఆకివీడు మండలంలోని అయిభీమవరంలో నీట మునిగిన వరిపొలాలు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మండలంలో 3,952 ఎకరాలు వరిసాగు అవుతుండగా రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు 250 ఎకరాలు నీట మునిగాయని నివేదిక ప్రభుత్వానికి పంపినట్టు ఆమె తెలిపారు. రైతులు పొలాల్లోని నీటిని బయటకు వెళ్లే మార్గం చూసుకుని పొటాష్ వెయ్యాలని యూరియా వెయ్యవద్దని సూచించారు.

వర్షపు నీటిలోనే పాఠశాల ప్రాంగణం

ఆకివీడు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన ప్రదేశాల్లో మంగళవారం నాటికి నీరు తగ్గలేదు. ఆకివీడులో రెండో వార్డు జానకీనగర్ ప్రాంతంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణ వరకూ నీరు చేరింది. పాఠశాలకు వెళ్లడానికి దారి లేదు. పాఠశాలలు దసరా సెలవులైనా అంగన్‌వాడీలు వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి సమస్య లేకుండా పారుదల చేయించాలని కోరుతున్నారు.


అయిభీమవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రియదర్శిని


ఆకివీడు ఎంపీపీ పాఠశాలలో నిలిచిన వర్షపునీరు


క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

29 నుంచి ఆర్‌ఆర్‌ఆర్ బ్యాడ్మింటన్ పోటీలు

ఉండి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):ఉండిలో నియోజకవర్గ స్థాయిలో ఈనెల 29వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఆర్‌ఆర్‌ఆర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్స్ పోటీలను నిర్వహిస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, కళ్లేపల్లి సతీష్‌రాజు, బీసీ సెల్ నాయకులు కునుకు శ్రీనివాస్, కర్రి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉండిలో మాజీమంత్రి కలిదిండి అబ్బాయిరాజు జన్మభూమి పార్కులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు తనయుడు భరత్ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రథమ బహుమతిగా రూ.30వేలు నగదు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు నగదు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకా రులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వగ్రే సముద్రమూర్తి, సరేపల్లి త్రిమూర్తులు, కరిమెరక సత్యనారాయణ, నల్లావల్లి సుబ్రహ్మణ్యం, లంక ప్రకాష్, మల్లువలస పాల్గొన్నారు.

'దుకాణాలకు లైసెన్సులు తప్పనిసరి'

ఆకివీడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వర్తకులు వ్యాపారాలు నిర్వహించే ముందు దుకాణాలకు లైసెన్సులు తప్పనిసరిగా పొందాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుందరరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీతారామాంజనేయ కూల్‌డ్రింక్స్, బాదం దుకాణాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించామన్నారు. దుకాణానికి లైసెన్స్ లేదని, దుకాణంలో తయారుచేసే వస్తువులను శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపిస్తామని, అనంతరం చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

'అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి'

ఆకివీడు,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):అనుమానస్పద వ్యక్తుల పట్ల ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేసమయంలో తాళాలు బయటకు కనపడకుండా వేసుకోవడం మంచిదన్నారు. ఇంటి లోపల, బయట వరండాలో లైట్లు వెలిగేలా చూడాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే 112 డయల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్‌ఐ హనుమంతు నాగరాజు ఉన్నారు.



తోట సీతారామలక్ష్మిని కలిసిన మత్స్యపురి ఆలయ కమిటీ సభ్యులు

'తోట'ను కలిసిన ధర్మకర్తల మండలి సభ్యులు

వీరవాసరం(భీమవరంటౌన్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామ అగస్త్యేశ్వర స్వామి దేవాలయ నూతన ధర్మకర్తలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతా రామలక్ష్మిని మంగళవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ దేవస్థాన పాలక వర్గ ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.













ఆకివీడులో గాయత్రిదేవి అలంకరణలో పెద్దింట్లమ్మ



భీమవరంలో చామంతులతో అమ్మవారికి అలంకరణ



భీమవరంలో విజయీభవ యాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కోపల్లెలో అమ్మవార్లకు వెండి ఆభరణాన్ని అందిస్తున్న దాతలు

గాయత్రి దేవీ నమోస్తుతే..

» రెండోరోజు కొనసాగిన శరన్నవరాత్రి పూజలు

భీమవరం టౌన్/భీమవరం క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రుల సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారు భక్తులకు మంగళవారం బాలా త్రిపుర సుందరీ అమ్మవారుగా దర్శనమిచ్చారు. ఆలయంలో లక్ష కుంకుమార్చన, చండీ హోమాలను నిర్వహించారు. పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవి బాలా త్రిపుర సుందరీ అమ్మవారుగా దర్శనం ఇచ్చారు. పట్టణంలోని దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధం సంస్థ పద్మావతీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దసరా పండగ విజయానికి నాంది అని, విజయీభావ యాత్ర దరిత్రిని శాంతి చేస్తుందని ఏపీ కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్ రోడ్డులో భక్తులతో దసరా విజయీభావ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమవరం కోర్టులో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయదశమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీ భేతాళస్వామి పూజ ఘనంగా జరిగింది. 1920వ దశకంలో ప్రారంభమైన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నేటికీ నిర్వహిస్తున్నారు. భీమవరం మావుళ్ళమ్మ ఆలయ సమీపంలో గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఏనుగు సంబరాన్ని నిర్వహిస్తున్నారు.

● ఆకివీడు/కాళ్ల/ఉండి ఆకివీడులో పెద్దింట్లమ్మ భక్తులకు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ గొంట్లా గణపతి, ఈవో అల్లూరి సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు. కాళ్ల మండలం కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధాన్యలక్ష్మి అమ్మవారిగా శ్రీలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాగి రాజు సాంబశివరాజు-సూర్యకుమారి దంపతులచే పూజలు నిర్వహించారు. ఉండి మండలం యండగండిలో శ్రీసువర్ణ దుర్గా మల్లేశ్వరికి పూజ లు నిర్వహించారు. ఆలయ 23వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు 108 కలశాలతో ఊరేగింపు జరిపారు.

అమ్మవార్లకు వెండి ఆభరణం బహూకరణ


కాళ్ళ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అమ్మవార్ల ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఉప సర్పంచ్ బూడి వెంకట పద్రాలు అన్నారు. కోపల్లెలోని కనకదుర్గమ్మ, శ్రీపరాలమ్మ అమ్మవార్లకు గ్రామానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి రాధాకృష్ణంరాజు-రమావతి దంపతులు, కుటుంబ సభ్యులు కేజీ వెండితో సుమారు రూ. 1.67 లక్షలు విలువ చేసే పులి ఆభరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు సత్కరించి, అభినందించారు.





కోపల్లెలో 'స్వచ్ఛోత్సవ్'

కాళ్ల : కోపల్లెలో 'స్వచ్ఛోత్సవ్' కార్యక్రమాన్ని బీజేపీ నేతలు మంగళవారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మూర్తి మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాలను దేశవ్యాప్తంగా 15 రోజులపాటు నిర్వహిస్తున్నామన్నారు.



మద్యం దుకాణదారులు ప్లాస్టిక్ వినియోగించొద్దు

» ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ బలరామరాజు

భీమవరం క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలో గల బార్ ఓనర్స్, మద్యం దుకాణదారులు ప్లాసిక్ సామగ్రి వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని, మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ ధరలకే మద్యం అమకాలు జరపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బలరామరాజు హెచ్చరించారు. భీమవరం స్టేషన్ పరిధిలో అన్ని ఏ4 దుకాణాలు, 2బీ బార్‌లలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించండి, పెంచండి అని తెలిపారు. భీమవరం స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తే కేసులు పెడతామని తెలిపారు. మద్యం షాపులు, బార్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలన్నారు. మద్యం షాపులు, బార్లలో వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ వంటివి ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించడం పూర్తిగా మానేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పి. ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆసుపత్రుల్లో న్యాయమూర్తి సందర్శన



ఆసుపత్రిలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సురేష్‌బాబు

భీమవరం క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న శాంతి, ప్రశాంతి, వర్మ మానసిక ఆసుపత్రులను ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు సందర్శించారు. మానసిక రోగులను పరామర్శించి వారి మానసిక ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయపరమైన సలహాలు, సూచనలు అవసరమైతే సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయవాదిని నియమిస్తామన్నారు. మానసిక వైద్యులు జీవీ రమణారావు, మాదిరెడ్డి వెంకటరమణ, శ్రీదేవి మానసిక వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న చికిత్స, డిప్రెషన్‌ను పోగొట్టడానికి తీసుకుంటున్న చర్యలను న్యాయమూర్తికి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు సుధీర్, జ్యోతి, రవికిరణ్, మీడియేషన్ న్యాయవాది విజయలక్ష్మి, పారా లీగల్ వలంటీర్లు శ్రీలక్ష్మి, చంద్రరావు పాల్గొన్నారు.



105 మందికి ఉచిత వైద్య పరీక్షలు

గణపవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సరిపల్లెలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 105మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సరిపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని సర్పంచ్ చనుమూరి లక్ష్మీభవాని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, ప్రభుత్వ వైద్యాధికారిణి కిరణ్మయి, ఎంపీహెచ్‌వో విల్సన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పోషకవంటకాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

శారదా మాతకు బంగారు కిరీటం

భీమవరంటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డులోని శ్రీ శారద మాత అమ్మవారికి దేవి శరన్నవరాత్రుల మహోత్స వాల్లో భాగంగా బంగారు తాపడంతో తయారు చేసిన కిరీటం, నాలుగు హస్తాలు, కర్ణ పత్రాలను అమెరికాకు చెందిన భక్తులు అందించారని ఆలయ అర్చకులు ఘంటసాల సోమేశ్వర శర్మ, ఘంటసాల దీక్షిత్ శర్మ తెలిపారు. దసరా మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా అమ్మవారికి ఈ ఆభరణాలను అలంకరణ చేశామని తెలిపారు.



అధ్యక్షా..

అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు పలు సమస్యలను లేవనెత్తారు. వారేమన్నారంటే..

• కార్మికుల సంక్షేమ బోర్డు బలోపేతం చేయాలి



లక్ష మంది కార్మికులు సభ్యులుగా ఉన్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డును మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిధులను పక్కదారి పట్టించింది. సభ్యులు దాచుకున్న సొమ్ము సైతం దోచుకుంది. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కమిటీని నియమించింది. పెండింగ్‌లో వున్న 50 వేల మంది క్లైయిమ్‌లు తక్షణం పరిష్కరించాలి. గత ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

• ఆయిల్‌పామ్ రైతులను ఆదుకోండి



గోపాలపురం నియోజకవర్గంలో 60 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు న్నాయి. ఇక్కడి రైతులకు ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలి. పొలాల మధ్యలో విద్యుత్ లైన్ల వల్ల కార్మికులు, రైతులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడుతున్నారు. విద్యుత్ లైన్‌ల వల్ల అక్కడ పంట వేయలేని పరిస్థితిలో సాగు విస్తీర్ణం తగ్గుతోంది. లైన్ల మార్పుపై రైతులపై భారం లేకుండా చూడాలి. విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న రైతులకు 25 కేవీ లేదా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తే వారిని ప్రోత్సహించినట్లు అవుతుంది.

- గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

• మునిసిపల్ పన్నులు సవరించాలి



ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాల పన్నులు, ఆస్తి పన్నులు సవరించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఏ మునిసిపాలిటీలోను లేని విధంగా ఇక్కడ కార్పొరేషన్ పరిధిలో ఖాళీ స్థలాలపై పెద్ద మొత్తంలో పన్ను వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల భవనాల విలువకంటే ఎక్కువ పన్ను విధించడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కార్పొరేషన్‌లో ఏడు గ్రామాలు విలీనమైన తర్వాత ఆయా గ్రామాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. వాటికి మూడున్నరేళ్ల పన్ను ఇప్పుడు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం పరిశీలించి భవనాలకు, వేకెండ్ ల్యాండ్‌కు ఒకే విధంగా పన్నులు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు కార్పొరేషన్‌లో పన్నుల సవరణ చేసేలా పరిశీలన చేస్తామని రెవెన్యూ మంత్రి ఎ.సత్యప్రసాద్ హామీ ఇచ్చారు.

• రహదారుల నిర్మాణాలకు నిధులివ్వండి



ఉంగుటూరు నియోజకవర్గంలో వంతెనలు, రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలి. నియోజకవర్గంలో కాలువలు పూడిపోయి ఆక్రమణలకు గురయ్యాయి. ప్రక్షాళనకు నిధులు ఇవ్వాలి. నారాయణపురం, గణపవరం వంతెనలతోపాటు నియోజకవర్గంలో ఐదు ప్రధాన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. 198 కిలోమీటర్ల రహదారులు నిర్మించాల్సి ఉంది.

- ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు నియోజకవర్గంలో వంతెనల నిర్మాణం, మరమ్మతులపై ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దనరెడ్డి సమాధానం ఇచ్చారు.

• సంక్షేమంతోపాటు రోడ్లు అభివృద్ధి చేయాలి



సంక్షేమంతోపాటు అభివృద్ధి వైపు చూడాలి. తాడేపల్లిగూడెం నియోజక వర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభిం చాలంటే కాంట్రాక్టర్లు పాత బిల్లులు ఇమ్మంటు న్నారు. రోడ్లు భవనాల శాఖా మంత్రి తాడేపల్లిగూ డెం నియోజకవర్గానికి నిధులు విడుదల చేయాలి. లేకపోతే గత ప్రభుత్వ పంథానే కూటమి అనుసరిస్తుందనే అపోహలు ప్రజల్లోకి వెళుతున్నాయి. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

• యనమదుర్రు వంతెనలకు అప్రోచ్ నిర్మించాలి



భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలు నిర్మించినా అప్రోచ్ రోడ్లు వేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. అప్రోచ్ రోడ్ల విషయంపై నాలుగుసార్లు సంబంధిత మంత్రి దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకుని వెళ్లాం. వంతెనలకు అప్రోచ్ రోడ్లు పూర్తిచేస్తే భీమవరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చు.

- భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి అంజిబాబు

• కైకలూరులో రహదారులు అధ్వానం



కైకలూరు నియోజకవర్గంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క రోడ్డు నిర్మించకపోవడంతో అవన్నీ ధ్వంసమయ్యాయి. కూటమి ప్రభుత్వం చాలా వరకు అభివృద్ధి చేసినప్పటికీ మా నియోజకవర్గంలో ఇంకా కొన్నిఅధ్వానంగానే ఉన్నాయి. 1.2 లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉండడంతో నిత్యం 40 టన్నుల లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారులు మెరుగు పరచాలి. ఆక్వా చెరువులు ఉన్న ప్రాంతాలపై ఆలోచన చేయాలి.

- కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

తణుకు/ద్వారకాతిరుమల/ఏలూరు టూటౌన్/నిడమర్రు/తాడేపల్లిగూడెం/భీమవరం టౌన్/కైకలూరు(ఆంధ్రజ్యోతి):

పదోన్నతులు కల్పించండి.. వీఆర్వో సంఘం వినతి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రేడ్ వన్ వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులను రెండేళ్లుగా ఇవ్వకపోవడం వల్ల అన్యాయం జరుగుతోందని వివరించారు. పదోన్నతుల విషయంలో ఇప్పటికే అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు అర్హులైన గ్రేడ్ 1, వీఆర్వోలతో భర్తీ చేయాలని కోరారు. గ్రేడ్ 2 వీఆర్వోలకు ప్రొబిషన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సర్వే ఎగ్జామ్స్, సీసీటి, పాసైన వారికి వెంటనే ప్రొబిషన్ డిక్లేర్ చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, రవికుమార్, ఎ.ప్రభాకర్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

లోటుపాట్లు రానివ్వద్దు

- 25న వెలగపూడిలో నియామక పత్రాలు అందుకోనున్న మెగా డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులు
- ఏలూరులో వసతి, ప్రయాణ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష
- నేడు 10 పాఠశాలలు, హాస్టళ్లకు 2400 మందికి పైగా అభ్యర్థులు, సహాయకుల రాక.. హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు



వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న వెలగపూడిలో నియామక పత్రాలు అందజేసేందుకు ఏలూరు నుంచి తీసుకెళ్ళే ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు తలెత్తరాదని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎస్సీ అభ్యర్థులకు ఏలూరులో వసతి, ప్రయాణ ఏర్పాట్లపై విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఆర్టీసీ, పోలీసు, రెవెన్యూ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన 1063 మంది, జోనల్ పోస్టులను ఎంపికైన 168 మందిని కలిపి మొత్తం 1231 మంది అభ్యర్థులకు 25న వెలగపూడిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను ముఖ్యమంత్రి అందజేయనున్నారని వివరించారు. అభ్యర్థులతోపాటు మరొకరు తోడుగా ఉండేలా ఏలూరు నుంచి అమరావతికి తీసుకెళ్లి, తిరిగి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులతోపాటు, వారి వెంట వచ్చే సహాయకులకు ఏలూరులో బస చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, బుధవారం రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ అభ్యర్థులు, వారి వెంట వచ్చే సహాయ కులు బుధవారం సాయంత్రం 4 గంటలకు వారికి కేటాయించిన రిసీవింగ్ సెంటర్ల (పాఠశాల/ వసతిగృహం)లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. హాల్ టిక్కెట్, కాల్ లెటర్, ఆధార్ కార్డు, ఫోటోను అభ్యర్థి తీసుకురావాలని, వారి వెంట వచ్చే సహాయకులు ఆధార్ కార్డు, ఫోటోను తీసుకురావాలి. ఏలూరులో బుధవారం రాత్రి బసకు దుప్పట్లు, ఇతర సామగ్రిని అభ్యర్థులే తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. వసతి, ప్రయాణ ఏర్పాట్ల సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ నంబర్లు 98668 23873 (కె.రాంబాబు), 91214 99645 (సీహెచ్.సీతా మహాలక్ష్మి)లలో సంప్రదించాలని కోరారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం, డీపీటీవో షబ్నం, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

7 పాఠశాలల్లో పురుష అభ్యర్థులకు వసతి

పురుష అభ్యర్థుల వసతికి ఏలూరులో 7 పాఠశాలలను కేటాయించారు. అభ్యర్థులు, వారి సహాయకులకు బుధవారం రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం అందించే ఏర్పాట్లను ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్‌కు, గురువారం మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలులోని ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల నుంచి చేసేలా అప్పగించారు. భోజన ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.300లు చొప్పున వెచ్చిస్తున్నట్టు తెలిసింది. మినహాయింపులు పొందిన అభ్యర్థులు పోను సుమారు 2400 మందికి పైగా బుధవారం ఏలూరులో వారికి కేటాయించిన రిసీవింగ్ సెంటర్లలో రిపోర్టు చేయాల్సి ఉంది. అభ్యర్థుల వారీగా వసతి, ప్రయాణ ఏర్పాట్లను కల్పించేందుకు పర్యవేక్షణ నిమిత్తం ఇప్పటికే నియమించిన ఎంఈవో, సీనియర్ హెచ్‌ఎంలు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులతో కూడిన బృందాలు యథాతథంగా పనిచేస్తాయి.

మహిళా అభ్యర్థులకు వసతి గృహాల్లో బస

డీఎస్సీకి ఎంపికైన మహిళా అభ్యర్థులందరికీ వసతి, ప్రయాణ ఏర్పాట్లను సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టళ్లలో కల్పించేలా ఎంపిక చేశారు. మొత్తం 700 మంది మహిళల కోసం వట్లూరు మెయిన్ బైపాస్‌పై వున్న ఏపీ సోషల్ వెల్ఫేర్, ఏలూరు అమీనాపేటలోని బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను ఖరారు చేశారు. ఎవరెవరికి ఎక్కడెక్కడి వసతి గృహాలను కేటాయించిందీ ఫోన్ల ద్వారా సమాచారమిచ్చారు. బాలికల హాస్టళ్లలో మహిళా అభ్యర్థులు రాత్రి నిద్రించేందుకు మంచాలున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని ఎంపిక చేసినట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు మొత్తం 31 మందికి ఉద్యోగ నియామక పత్రాల అంద జేత కార్యక్రమానికి హాజరు కానవసరం లేకుండా మినహాయింపు నిచ్చారు.



లాంఛనాలు భరించలేం !

- తనిఖీల పేరుతో తూనికలు కొలతల శాఖ వసూళ్లు
- బెంబేలెత్తుతున్న రేషన్ డీలర్లు

(తణుకు రూరల్-ఆంధ్రజ్యోతి)

తూనిక యంత్రాల లోపాలను గుర్తించి సరిచేసేందుకు నిర్వహించే తనిఖీలకు వసూళ్లు నానాటికీ పెరిగిపోవడంతో రేషన్ డీలర్లు, వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో వస్తువులను తూకానికి కేజీల వారీగా ఇనుపరాళ్లను ఉపయోగించేవారు. అయితే వాటిని ఏళ్ల తరబడి ఉపయోగించడం వల్ల అరుగుదల ఏర్పడటంతో అప్పట్లో తూనికలు, కొలతల శాఖ సిబ్బంది ఏటా తనిఖీలు నిర్వహించి లోపాలుంటే వాటిని సరి చేసి సీలు వేసి ఇచ్చేవారు. అందుకు సిబ్బందికి రేషన్ డీలర్లు, వ్యాపారులు ఎంతో కొంత ముట్టజెప్పేవారు.

కాలక్రమేణా అది చట్టబద్ధమైన లాంఛనంగా మారింది. గతంలో 100 కేజీల సామర్థ్యం గల తూనిక యంత్రాలకు 2023 వరకూ లాంఛనం గా రూ.300 ఒక్కో డీలరు, వ్యాపారి నుంచి స్వీకరించే వారని డీలర్లు, వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ లాంఛనం 2023 నుంచి రూ.900 చెల్లిస్తుండగా అది కాస్తా ఈ ఏడాది నుంచి రేషన్ డీలర్లు రూ.1400, వ్యాపారులు రూ.1200లుగా నిర్ణయిం చారని డీలర్లు పేర్కొంటున్నారు. అప్పట్లో ఉపయోగించిన తూకం రాళ్లలో తరుగుదల ఏర్పడితే దానిని భర్తీ చేసేందుకు సీసం, ఇతర పదార్థాలను కరిగించి ఏర్పడిన లోటును భర్తీ చేసేవారు. అందుకయ్యే వ్యయం నిమిత్తం రుసుం వసూళ్లు చేసేవారు. ఇలా ఎన్నిసార్లు తనిఖీలు చేస్తే అన్నిసార్లు వారి నుంచి సంబంధిత శాఖ సిబ్బంది రుసుం వసూళ్లు చేసేవారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాల్లో లోపాలను సరిచే యడం సులభతరమైనప్పటికీ తరుగు, అరుగుదల ఏర్పడేదేమీ లేనప్పటికీ మామూళ్ల రూపంలో వసూలు చేయడం భారంగా మారిందని పేర్కొంటున్నారు.

వారికి తనిఖీలు ఉండవా?

లీగల్ మెట్రాలజీ సిబ్బంది రోడ్ల పక్కన, మోటారు సైకిళ్లపై వ్యాపారాలు చేసే సంచార వ్యాపారులు ఉపయోగించే కాటాలను తనిఖీలు చేయరా? అని డీలర్లు, వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఏటా షాపులు, చౌక దుకాణాల నిర్వాహకులపై తరచూ దాడులు చేసి కేసులు నమోదు చేసే తూనికలు, కొలతల శాఖ సిబ్బంది, అధికారులు వీధి వ్యాపారులు, రోడ్డు ప్రక్కన వ్యాపారాలు చేసే వారి తూనిక యంత్రాలను కూడా తనిఖీలు చేయాలని కోరుతున్నారు.

వసూళ్ల పెంపు దారుణం



ప్రతి ఏటా చౌక దుకాణాలు నిర్వహించే రేషన్ డీలర్లు ఉపయోగించే తూనిక యంత్రాలకు తనిఖీల పేరుతో సొమ్ములు వసూళ్లు చేయడం భారంగా వుంది. డీలర్ల నుంచి వసూలు చేస్తున్న మొత్తం గత మూడేళ్ల కాలంలో రూ. 300 నుంచి రూ. 1400 పెంచడం దారుణం. దీనిని పునఃపరిశీలించాలి.

-ఇమ్మంది శంకర రావు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, తణుకు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ.. మోటార్ సైకిల్ ర్యాలీ


భీమవరం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం భీమవరం అంబేద్కర్ చౌక్ నుంచి దగ్గులూరు మెడికల్ కళాశాలకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రభుత్వ రంగంలోనే ఉంటే ప్రజలకు, రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు లంకా కృష్ణమూర్తి, కె.మహంకాళి, గంటా సుందర్‌కుమార్, ఈదా శేఖర్‌బాబు, మెడికల్ రిప్రజంటేటివ్‌ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, గాతల జేమ్స్ పెండ్ర వీరన్న, నన్నేటి పుష్పరాజ్, టి. ప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ ప్రసంగించారు. మత్తె రాజ్‌కుమార్, సూడదాసు గంగయ్య, రామాని కాస్ట్రో, మల్లుల శ్రీనివాస్, బీఎస్‌ఎస్ ప్రసాద్, బి.ప్రసాద్, బి.రమేష్, కాకర రాజ్‌కుమార్, బి.వాసుదేవరావు, ఎం. ఆంజనేయులు, ఎం వైకుంఠరావు, మామిడిశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను వాహనాల్లో తరలిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, పెదపాడు పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీసులు మాట్లాడుతూ వాహనాలను, చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

చెక్ బౌన్స్.. ఏడాది జైలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో గతంలో వాచ్‌మన్‌గా పనిచేసిన పెందిలి షద్రక్ కుటుంబ అవసరాల నిమిత్తం స్థానికంగా ఉంటున్న గూడవల్లి విద్యా సాగర్ వద్ద 2022వ సంవత్సరం సెప్టెంబరులో రూ.5 లక్షల 50 వేలు అప్పుగా తీసుకున్నారు. ఆ అప్పు తీర్చే క్రమంలో 2023 సెప్టెంబరులో రూ.4లక్షల చెక్కును విద్యాసాగర్‌కు షద్రక్ అం దజేశారు. ఆ చెక్కును జమ చేసుకునేందుకు బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది.ఈ క్రమం లో దీనిపై విద్యాసాగర్ కోర్టులో కేసు వేశారు. ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో మంగళవారం ఈ కేసుకు సంబంధించి విచారణ చేపట్టారు. చెల్లని చెక్కు ఇచ్చిన నేరం రుజువైనందుకు షద్రక్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. దీంతో పాటు రూ.4 లక్షలు చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.



విద్యుత్ స్తంభంపై మంటలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై ఉన్న కేబుల్ వైర్లు అకస్మాత్తుగా అగ్ని ప్రమాదానికి గురై మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన ఎలక్ట్రికల్ శాఖాధికారులు విద్యుత్ నిలుపుదల చేశారు.ఏలూరు విజయ్‌విహార్ సెంటర్ సమీపంలో రిలయన్స్ ఎదురుగా ఒక విద్యుత్ స్తంభంపై అకస్మాత్తుగా కేబుల్ వైర్లు మంగళవారం రాత్రి దగ్ధమవడం ప్రారంభమయ్యాయి. మంటలు వ్యాపించడంతో వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకుంది.విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్‌ను నిలుపుదల చేశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖాధికారులు వెల్లడించారు.



ద్వారకాతిరుమల దేవస్థానంలోని టీటీడీ సదనం

భక్తురాలి పట్ల అసభ్య ప్రవర్తన ?

తాత్కాలిక ఉద్యోగి తీరుతో కుటుంబ సభ్యుల దేహశుద్ధి

విధుల నుంచి తొలగిస్తూ ఈవో ఉత్తర్వులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చి టీటీడీ సదనంలో విశ్రాంతికి దిగిన ఓ భక్తురాలితో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో దేవస్థానం అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నారాయణను విధుల నుంచి తొలగించారు. విశాఖకు చెందిన ఓ కుటుంబం సోమవారం సాయంత్రం స్వామి దర్శనానికి క్షేత్రానికి వచ్చారు. టీటీడీ సదనంలోని గదిని అద్దెకు తీసుకున్నారు. వారితో సత్రం గుమస్తాగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నారాయణ చనువుగా ఉన్నాడు. ఇలా ఉండగా సోమవారం సాయంత్రం కుటుంబంలోని ఓ మహిళకు జ్వరంవచ్చింది. వారితో మాట్లాడిన గుమస్తా మంగళవారం తెల్లవారు జామున 'జ్వరం తగ్గిందేరా' అంటూ చెయ్యి పట్టుకున్నట్టు ఆమె ఆరోపించింది. అదే సమయంలో ఆగ్రహంతో అతడిని కొట్టింది. కుటుంబ సభ్యులు సైతం నారాయణకు దేహశుద్ధి చేశారు. దీనిపై ఆలయ అధికారులకు భక్తురాలు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన అధికారులు విచారణ జరిపి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నారాయణను విధుల నుంచి తొలగించారు.ఈ ఘటనపై ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి వివరణ ఇస్తూ భక్తురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం నారాయణను విధుల నుంచి తొలగించినట్టు తెలిపారు.

చేసిన అప్పు తీర్చలేక ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి పురుగు మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. ద్వారకాతిరుమల మండలం లైను గోపాలపురానికి చెందిన శృంగవృక్షం నాగరాజు(33)భార్య, ఇద్దరు పిల్లలున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వివిధ అవసరాల నిమిత్తం పలువురి వద్ద రూ.5 లక్షల వరకు అప్పుచేశాడు. ఆ అప్పు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని చినఔటపల్లి దగ్గరలో వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక వ్యక్తి(40) జారిపడి నుజ్జునుజ్జు అయిపోయాడు. మృతుడు ఛామనఛాయ శరీరంతో 5 అడుగులు ఎత్తు కల్గి ఉన్నాడు. ట్రెయిన్ వేగంగా వెళ్తున్న సమయంలో కిందపడటంతో మృతుడి శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయని ప్రాథమికంగా అంచనా వేశారు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి శరీర భాగాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అతను రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

పుట్టినరోజు వేడుక క్షణాలు చెరిగిపోకుండానే..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



లారీ కిందపడి మృతి చెందిన సాయి ప్రకాశ్

పెదపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు జరుపుకున్న మధుర క్షణాలు కుటుంబ సభ్యులు, బంధువుల కళ్లముందు కదలాడుతుండగానే అతడిని రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించింది. మండవల్లి మండలం ఇంగిలంపాకలంక గ్రామానికి చెందిన ఘంటసాల సాయిప్రకాశ్(23) డిగ్రీ పూర్తి చేసి విజయవాడలోని ప్రైవేటు సంస్థలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న పుట్టినరోజు కాగా, కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకునేందుకు స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో మోటారు సైకిల్‌పై విజయవాడ బయల్దేరాడు. సుమారు 9 గంటల ప్రాంతంలో పెదపాడు మండలం కలపర్రు టోల్ గేట్ సమీపంలోకి వచ్చేసరికే తణుకు నుంచి చాట్రాయి వైపు అట్టల లోడుతో వెళుతున్న లారీ వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సాయి ప్రకాశ్ లారీచక్రాల కింద నలిగి తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు.సాయిప్రకాశ్ చిన్నాన్న మోరు వెంకట శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్.సి. వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతుల కాళ్లూ.. చేతులు కట్టేసి..

30 కాసుల బంగారం, వెండి వస్తువులు చోరీ - కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో ముగ్గురు గుర్తు తెలియని దుండగులు ఓ ఇంట్లోకి ప్రవేశించి వృద్ధ దంపతులను బంధించి 30 కాసుల బంగారం, వెండి వస్తువులు దోచుకుపోయిన ఘటన మంగళవారం కలకలం సృష్టించింది. లక్కవరం గ్రామానికి చెందిన వందనపు రుక్కయ్య, అంజనీకుమారి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలిద్దరికి వివాహాలు జరిగాయి. ప్రస్తుతం ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటున్నారు. లక్కవరంలోని తమ ఇంటిలో వృద్ధులిద్దరే ఉంటారు. మంగళవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ఇంటి తలుపును తొలగించి ముగ్గురు దుండగులు లోపలికి ప్రవేశించారు. మొదట బెడ్ రూంలో వెతికారు. ఏమీ దొరక్కపోవడంతో వృద్ధ దంపతులు నిద్రిస్తున్న రెండవ బెడ్ రూంలోకి ప్రవేశించారు. అలికిడి విని నిద్రలేచి ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ఇద్దరి నోరు మూశారు. వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారమంతా తీసుకున్నాడు. తరువాత వారితో బీరువా ఓపెన్ చేయించి అక్కడే ఉన్న టవల్స్‌తో వారి చేతులు, కాళ్లు కట్టేసి బీరువాలోని బంగారం, వెండి వస్తువులు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. చంపుతామని బెదిరించడంతో వృద్ధ దంపతులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దొంగలు అడిగినవన్నీ ఇచ్చేశారు. గదిలో లైట్లు వేయకుండా వారి వెంట తెచ్చుకున్న బ్యాటరీ లైట్ల వెలుగులోనే తమ పనంతా పూర్తి చేశారు. దుండగులు వెళ్లిపోయిన వెంటనే కట్లు విప్పుకుని వృద్ధుడు రుక్కయ్య స్థానికుల సహకారంతో లక్కవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన డీఎస్పీ యు.రవిచంద్ర ఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములు వచ్చి దర్యాప్తు చేపట్టాయి. ఈ సందర్భంగా డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ వృద్ధ దంపతులను బంధించి, బెదిరించి దోపిడీకి పాల్పడిన దుండగుల కోసం గాలిస్తున్నామని, అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ తెలిపారు.

ఈత కొట్టేందుకు చెరువులో దిగి బాలుడి మృతి



మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈత కొడదామని చెరువులోకి దిగిన ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. తిరుమలంపాలెంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముత్తే రాజు(14) స్థానిక జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. స్కూళ్లకు సెలవులు కావడంతో తోటి స్నేహితులు మరో నలుగురితో కలిసి చెరువులో ఈత కోసం దిగారు.చెరువులో ఉన్న మట్టి తవ్వకాల గోతిలో పడిన రాజు మునిగిపోయాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన గండికోట సుబ్బారావు కేకలు వేయడంతో పిల్లలు బయటకు వచ్చి రాజు అందులో మునిగిపోయాడని చెప్పి వెళ్లిపోయారు. దీంతో సుబ్బారావు అందులోకి దిగి రాజును బయటకు తీసుకొచ్చాడు. బాలుడు అప్పటికే మృతిచెందాడు. గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు బంధువులు అక్కడకు చేరుకుని మృతదేహం వద్ద రోధించారు.

'ఏఎస్ఎన్ఎం'లో ఆయుర్వేద వైద్యంపై అవగాహన సదస్సు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకోసం, ప్రపంచం కోసం ఆయుర్వేద వైద్యం అవసరమని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వి. యామిని అన్నారు. కళాశాలలో మంగళవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వన మూలికల ప్రదర్శన, విద్యార్థులకు క్విట్ పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కృష్ణ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఒకేషనల్ విద్యా కోర్సులతో నైపుణ్యం పెంపు'

ఆచంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ విద్యాకోర్సులతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని వేమవరం హైస్కూలు హెచ్‌ఎం ఎ.సత్యనారాయణ అన్నారు. మంగళవారం హైస్కూలులో టెన్త్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఒకేషనల్ ట్రైనర్ వడ్లపాటి నాగభూషణం ఆధ్వర్యంలో ఒకేషనల్ విద్యార్థులకు ఆటోమోటివ్ ట్రేడ్‌లో భాగంగా పది రోజులపాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా వాహన రిపేరు వర్క్స్ నిర్వహించారు. డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ సంజీవ్ కుమార్, సీఎంవో చంద్రశేఖర్ వివరించారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిద్దాంతంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పెనుగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 2017లో జీఎస్టీ ప్రారంభించినప్పుడు నాలుగు శ్లాబ్‌లు ఉండేవని ఇప్పుడు రెండు శ్లాబ్‌లకు కుదించి సామాన్యుల కొనుగోలు శక్తి పెంచడానికి ఎంతో ఉపయోగపడుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు నాగూర్ అన్నారు. మంగళవారం సిద్దాం తంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీనీ తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జీఎస్టీపై వచ్చిన ఆదాయంతో దేశాభి వృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. కూటమి నాయకులు కట్టా శ్రీను, కడలి సత్యనారాయణ, బొబ్బిలి శ్రీను, ఇరగవరపు రాధాకృష్ణ, నక్కా సత్యనారాయణ, మానేపల్లి పురుషోత్తం, ఏఎంసీ డైరెక్టర్ వంగూరి రామకృష్ణ, బిరుదుకోట సుబ్రహ్మణ్యం, పొదల సుమన్, ఉటాల చంటి, బొబ్బిలి సత్యనారాయణ, చింతాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.









'మంచినీటి చెరువుల్లో పూడిక తీయాలి'

నరసాపురం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలంలోని మంచినీటి చెరువుల్లో పూడిక పనులు చేపట్టాలని మాజీ సర్పంచ్ కూనపరెడ్డి రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం నరసాపురంలో ఆయన మాట్లాడుతూ చెరువుల్లో దశాబ్దాలుగా పూడిక తీయకపోవడం వల్ల ప్రజలు ఆ నీటినే తాగి రోగాలబారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పూడిక పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వ విప్ నాయకర్‌కు వినతిపత్రం ఇవ్వడంతో పాటు అసెంబ్లీలో సమస్యపై చర్చించి పరిష్కరించాలని విన్నవించారు.








నరసాపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


పెదమల్లంలో గాయత్రిదేవి అలంకరణలో మాచేనమ్మ


పాలకొల్లులో గిరిజా దేవి అలంకరణలో కనక దుర్గమ్మ

గాయత్రి దేవీ నమోస్తుతే..


» రెండోరోజు కొనసాగిన శరన్నవరాత్రి పూజలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాలకొల్లులోని క్షీరా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, గాయత్రి దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో శ్రీనివాసరావు, ఛైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. వాసవీ ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో చిన్నగోపురం వీధిలోని కల్యాణ మండపంలో అమ్మవారిని అన్నపూర్ణదేవ్మిగా ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణం చేశారు. వాసవీ సంఘ సభ్యులు మామిడి వెంకటేశ్వరరావు, ప్రవీణ్ భాను, బాపిరాజు, కారుమూరి రామలింగేశ్వరరావు, లక్ష్మీకనకదుర్గ, పాల్గొన్నారు.

మొగల్తూరు/నరసాపురం : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం దుర్గాదేవి ఆలయాలతో పాటు పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవార్లను గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవిని, భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ అమ్మవారిని, కూరగాయల మార్కెట్, పడమటిపాలెం, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్లను గాయత్రీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. నరసాపురం స్టీమర్‌రోడ్‌లోని పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని బ్రహ్మచారిణీదేవిగా దర్శనమిచ్చారు. శిద్ధాని గోపి, దుర్గా నాగేశ్వరి దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. మండెల కృష్ణ, గునిశెట్టి సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● పెనుగొండ/ఆచంట/పెనుమంత్ర : పెనుగొండ శ్రీవాసవీ శాంతి ధామ్‌లో వాసవి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆచంట మండలంలో అమ్మవార్లు గాయత్రిదేవిగా దర్శనం ఇచ్చారు. ఆచంటలో పార్వతి అమ్మవారు, పెదమల్లం మాచేనమ్మ అమ్మవారిని అనేక మంది భక్తులు దర్శించుకున్నారు. పెనుమంత్ర మండలం మార్టేరు శివరావుపేటలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.





ముంపు పొలాల్లో అధికారుల పరిశీలన

నరసాపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంట పొలాలు మునిగిపోతున్నాయంటూ రైతులు చేసిన పోరాటానికి అధికారులు దిగొచ్చారు. మంగళవారం పసలదీవి గ్రామంలో వెస్ట్‌కొక్కి డ్రెయినేజీ వల్ల ముంపునకు గురవుతున్న పొలాలను డ్రెయినేజీ శాఖ ఏడీ పావని పరిశీలించారు. రైతుల్ని సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. తక్షణం అంచనా తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. గత వారంలో పసలదీవి రైతులంతా ముంపు సమస్యపై ఆందోళనకు దిగిన విషయం విదితమే. అప్పట్లో ప్రభుత్వ విప్ నాయకర్ గ్రామానికి వెళ్లి అధికారుల్ని పంపించి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగానే ఏఈ పావని, మరికొందరు ఇరిగేషన్ అధికారులు వచ్చి డ్రెయినేజీని పరిశీలించారు. పూడికపోయిన డ్రెయినేజీని త్వరలో తవ్వుతామన్నారు. డెల్టా ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు గుబ్బల మార్రాజు, మాజీ ఎంపీపీ వాతాడి కనకరాజు, దామోదరరావు, సీతానందం, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవన స్థితిగతులపై సర్వే చేయాలి


కమిషనర్ శంకర్ నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఛైర్మన్ పెద్దిరాజు

నరసాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత మత్స్యకారులతో పాటు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలోని మత్స్యకారుల జీవన పరిస్థితులు, వలసపై ప్రభుత్వం సర్వే చేయించాలని మంగళవారం రాష్ట్ర మత్స్యకార, సంక్షేమ ఆభివృద్ధి ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు కోరారు. మంగళవారం ఆ శాఖ కమిషనర్ శంకర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశరు. ఇటీవల తీర ప్రాం తంలో మత్స్యకారులు వలసబాట పట్టారని, వేటాడిన మత్స్య సంపద చిక్కకపోవడం, మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం వంటి కారణాలుగా సంప్రదాయ వృత్తిని విడిచి పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు తరలి వెళుతున్నారన్నారు. వీటిపై ఒక సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. తీర ప్రాంత మత్స్యకారులకు అవసరమైన వేట సామగ్రి, సబ్సిడీ రుణాలు అందించాలని విన్నవించారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు పెద్దిరాజు చెప్పారు.



కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

మొగల్తూరు. సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులు లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్, వ్యవసాయశాఖ ఏడీ ప్రసాద్ సూచించారు. మంగళవారం శేరేపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయిస్తే రైస్ మిల్‌కు రైతు వెళ్లి వేలిముద్ర వేసిన 48 గంటల లోపు ధాన్యం డబ్బులు రైతు ఖాతాల్లో జమ అవుతాయని వివరించారు. సర్పంచ్ బందెల ఎలీషా, ఏవో అబ్దుల్ రహీమ్, రైతులు, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖల సిబ్బంది పాల్గొన్నారు.





పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ


పేదలకు సరుకులు అందజేస్తున్న నాయకులు

ఆచంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వల్లూరులో జనసేన ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు మంగళవారం అందజేశారు. ఇటీవల కొన్ని రోజులుగా జనసేన ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పేదలకు సరుకులు అందజేస్తున్నారు. జనసేన నాయకులు చిట్టూరి శ్రీనివాస్, తోట ఆదినారాయణ, కాపవరపు రామకృష్ణ, పంపన శ్రీనివాస్, దివి సాయి బాబు, తోట సాయిబాబా, తాళం రమేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

పోడూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంట్లో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని పోడూరు పీహెచ్‌సీ డాక్టర్ వాసవి అన్నారు. కవిటం శివారు నల్లవెంకయ్య చెర్వులో మంగళవారం జరిగిన స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ చుట్టిగుళ్ల పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.








మందులు అంద జేస్తున్న చైర్మన్ భోగేశ్వ రరావు

'ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం'

పెంటపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి అన్నారు. మోదీ పుట్టిన రోజు కార్యక్రమాలు పురస్కరించుకుని మంగళవారం అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ ప్రాంగణంలో చైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గట్టిం మాణిక్యాలరావు, సొసైటీ చైర్మన్ పసుపులేటి అమ్మిరాజు, యూవీవీ సత్యనారాయణ, కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి'

తణుకు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీ.వీ.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్రపతి రోడ్డులోని హైస్కూలు గేటు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. సమ్మెకాలంలో జరిగిన ఒప్పందాలపై జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెంలో గాజుల అలంకరణలో విశ్వదుర్గేశ్వరి అమ్మవారు


తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీలో కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు


తాడేపల్లిగూడెంలో వాసవీ మాతకు గజలక్ష్మి అలంకరణ


తాడేపల్లిగూడెంలో గాయత్రీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి

గాయత్రి దేవీ నమోస్తుతే..

» రెండోరోజు కొనసాగిన శరన్నవరాత్రి పూజలు

తాడేపల్లిగూడెం/అర్బన్/రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా రెండోరోజు మంగళవారం ఆలయా ల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్లను గాయత్రీదేవిగా అలంకరించారు. తాడేపల్లిగూడెం పురదేవత బలుసులమ్మను గాయత్రిదేవిగా అలంకరిం చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వా హకులు శ్రీరంగం అంజి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాసవీ పంచాయతన క్షేత్రంలో వున్న వాసవీ మాతకు గజలక్ష్మిగా అలంక రించారు. వీకర్స్‌కాలనీలో గాయత్రి దేవిని బాలత్రిపురసుందరి దేవిగా అలంకరించారు. రాజరాజేశ్వరి పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. రామచంద్రరావుపేటలో ఉన్న శ్రీకృష్ణయోగ ధ్యాన మందిరంలో ఉన్న చింతామణి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రిదేవి అలంకరణ చేశారు. నిర్వాహకులు ఇందుకూరి మోహనరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


గాయత్రి దేవి అలంకరణలో మండపాక యల్లారమ్మ

పట్టణంలోని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో విశ్వదుర్గేశ్వరి అమ్మవారి ఆలయంలో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం గాజులు, పసుపు కొమ్ములతో అలకరిం చారు. కుంకుమ పూజలు నిర్వహించారు. వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో అమ్మవారు బ్రహ్మచారిణిగా దర్శన మిచ్చారు. ముత్యాలంబపురం ముత్యాలమ్మ గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వీకర్స్ కాలనీ గాయత్రిదేవి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు 108 కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఆరుగొలను విజయదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారికి గాయత్రి దేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

● తణుకు రూరల్ : మండపాక గ్రామంలో వున్న శ్రీ యల్లారమ్మ అమ్మవా రిని గాయత్రి దేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'ఓజీ' గత రికార్డులను తిరగరాస్తుంది : ఆరిమిల్లి


పవన్ కటౌట్ ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆరిమిల్లి

తణుకు, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన ఓజీ చిత్రం గత రికార్డులను తిరగరాస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. వేంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పవన్ కల్యాణ్ కటౌట్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయా ల్లో ఎంతో బిజీగా ఉన్నప్పటికి మరోపక్క తాను నమ్ముకున్న కళారంగాన్ని వదల కుండా ప్రేక్షకులు, అభిమానులను మెప్పించే చిత్రాలను చేయడం అభినం దనీయ మన్నారు. అధిక సంఖ్యలో ప్రేక్షకులను థియేట ర్లను రప్పించి భారీ కలెక్షన్లు సాధిస్తుం దన్నారు. పవన్ కల్యాణ్ అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను పరిష్కరించాలి

తణుకు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో చదివే విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే పరిష్కరించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి ఎస్‌వీ అరుణ కుమారి అన్నారు. మంగళవారం తణుకులోని మహిళా కళాశాలలో నిర్వహించిన తణుకు, ఇరగవరం, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాలకు చెందిన హాస్టళ్ల అధికారులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హాస్టళ్లలో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు వార్డెన్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు కృషి చేయాలని కోరారు. పలు కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో పాటు వార్డెన్‌లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



తేతలి అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నరేంద్ర

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి

» తణుకు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సంచాలకుడు నరేంద్ర

తణుకు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పండించే పంట వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులతో ఆన్‌లైన్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని తణుకు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సంచాలకుడు జి.నరేంద్ర సూచించారు. మంగళవారం తణుకు రూరల్ మండంలోని ముద్దాపురం, తేతలి గ్రామాల్లోని సొసైటీ ఆధ్వర్యంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తేతలి సొసైటీ కమిటీ చైర్మన్ మట్టా వెంకట్, ముద్దాపురం సొసైటీ కమిటీ చైర్మన్ ముళ్లపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినట్లు తెలిపారు. ఎ-గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2389లుగా కామన్ రకం ధాన్యానికి రూ.2369గా ప్రభుత్వం ప్రకటించినట్టు తెలిపారు. ఎంటీయూ 7029, ఎంటీయూ 1318, పీఎల్‌ఏ 1100 కామన్ రకాలుగా గర్తించబడతాయని తెలిపారు. రైతులు తమ పంటను ఈకేవైసీ చేసేటప్పుడు, వేలిముద్రలు వేసేటప్పుడు ప్రతీ రైతు ఈ-పోర్టల్‌లో తమ పొలం విస్తీర్ణం సరి చూసుకోవాలని వ్యవసాయాధికారి కె.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

'పేదలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం'

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 23.(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే స్వస్ట్ నారీ సశక్త్ పరివార్ అబియాన్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారని ఏఎంసీ డైరెక్టర్ కామిశెట్టి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కామిశెట్టి ఉమాశంకర్ పేర్కొన్నారు. పడాలలో వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ డాక్టర్ రూపాదేవి ఆధ్వర్యంలో 165 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. వారిలో ఇద్దరు మహిళలకు బ్రస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్టు గుర్తించి ఆసుపత్రికి రావాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార మేళా పెట్టి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తా ధనరాజు, పులి సూర్యప్రసాద్, కుంచే లక్ష్మణ్, పాతూరి అబ్దుల్ కుమార్, కామిశెట్టి మోహన్, కార్యదర్శి కె.శ్రీనివాస్, వీఆర్‌వో విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆరిమిల్లి కృష్ణ తులసి

'విద్యతోనే మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి'

తణుకు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. మంగళవారం చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజిలో మహిళా సాధికారత విభాగం, మానవత సంయుక్త ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత కేవలం ఆర్థిక స్వావలంబన మాత్రమే కాదని, ఆత్మవిశ్వాసం పొందడమన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ఉపాధి అవకాశాలను సృష్టించగలరన్నారు. అనంతరం వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు మాట్లాడుతూ మహిళా సాధికారత సమాజాభివృద్ధికి కీలకమన్నారు. డాక్టర్. కె.రాధాపుష్పావతి, జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, రామలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకు పోరాడాలి


మాట్లాడుతున్న డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకు పోరాటం కొనసాగుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ స్పష్టం చేశారు. ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ విస్తృతస్థాయి సమావేశం సిపాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో మంగళవారం ఓవీ రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లా డుతూ ఉద్యోగ కార్మిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగించాలన్నారు. కార్మికోద్యమం పలు రంగాల కార్మికులను ఐక్యపచాలని అన్నారు. అక్టోబరు 17, 18వ తేదీల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు తాడేపల్లిగూడెంలో జరుగుతా యన్నారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓవీ రాజు, బ్యాంక్ ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌ఎస్‌ప్రసాద్, తోట సూర్యనారాయణ, మండలపర్తి హరీష్, కళింగ లక్ష్మణరావు, తాడికొండ శ్రీనివాసరావు, పడాల శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 25న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. స్త్రీలు, జనరల్, చెవి, ముక్కు, గొంతు, గుండె సంబంధిత వైద్య నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీఈకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

26 మంది వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు

తణుకు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యాలయంలో వృద్ధులకు ఉచిత వైద్య సేవలను ప్రముఖ డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు 26 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాదు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఇరగవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారంతో పాటు ఆరోగ్య సూచనలు పాటించాలని ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ క్రాంతిరెడ్డి అన్నారు. మండలంలోని కంతేరు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 135 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుడిమెట్ల ఆదిలక్ష్మి, కూటమి నాయకులు సత్తి సోమశేఖరరెడ్డి, గుడిమెట్ల వీర్రెడ్డి, ముప్పిడి నర్సింహమూర్తి, కార్యదర్శి వి.రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.